www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 26 సెప్టెంబర్ 2025 5 కాకినాడ

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట ఫ్లే ఓవర్ బ్రిడ్జికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. హైవే బ్రిడ్జ్‌ు అటు ఇటు రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తమ అభిమానులు ఏర్పాటు చేశారు. గురువారం జన సంచార సమయంలో గాల్లో వేలాడుతున్న ఫ్లెక్సీ ఒకటి అటుగా వెళుతున్న ఆటోపై పడింది. అదే ద్విచక్రవాహనంపైనో, ప్రయాణికులపైనో పడితే భారీ ప్రమాదమే జరిగేది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు ప్రాణ శంకటంగా మారిన ఫ్లెక్సీలను తొలగించాలని కోరుతున్నారు.

ఆటోపై పడిన ఫ్లెక్సీ

పని గంటల పెంపుతో ఒత్తిడి

- అనారోగ్యాలకు దారితీసే అవకాశం
- శ్రామికుల ఉపాధికి గండి
- పోరాటానికి సిద్ధపడుతున్న కార్మిక వర్గం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

శ్రామిక వర్గాన్ని దోపిడీ చేసేందుకు కూటమి ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తుంది. మోడీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టానికి అనుగుణంగా చంద్రబాబు కార్మికులకు పని గంటలను పెంచేలా అసెంబ్లీలో నిర్ణయం తీసుకోవడం శోచనీయమని కార్మిక వర్గం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పెట్టుబడిదారులు, కార్పొరేట్‌లకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో 956 చిన్నా, పెద్ద పరిశ్రమల్లో సుమారు 20 వేల మంది పారిశ్రామిక కార్మికులు పని చేస్తున్నారు. అలాగే దాదాపు 2 వేల మంది కాకినాడ పోర్టు కేంద్రంగా కార్మికులు పనులకు వెళుతున్నారు. జిల్లాలో ఉన్న ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, జీడీపిక్కల పరిశ్రమల్లో దాదాపు 10 వేల మంది మహిళలు పనులకు వెళుతున్నారు. వీరందరి పైనా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం పని గంటల పెంపు భారం ప్రత్యక్షంగా పడుతుంది. భవన నిర్మాణరంగ కార్మికులు, ఆటో డ్రైవర్లు, హమాలీలు, రవాణా రంగ కార్మికులు అసంఘటిత రంగంలో పని చేస్తున్నారు. వీరంతా సుమారు 3 లక్షల మంది ఈ జిల్లాలో ఉన్నారు. వీరందరిపైనా పని గంటల పెంపు భారం పరోక్షంగా పడుతుంది. అనేక మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని దినాన్ని చంద్రబాబు 13 గంటలకు పెంచడంతో ఆయా సంస్థల యాజమాన్యాలు సంఘటన కార్మికులతో పాటు పనిచేయాలని అసంఘటన కార్మికులపై ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉంది.

కూటమి ప్రభుత్వ నిర్ణయం వలన అదనపు పని గంటలు పనిచేస్తే అదనంగా ఒనగూరే ప్రయోజనం కార్మికులకు ఏమీ ఉండదు. వేతనాలు పెరగవు. ఇప్పటికే అరకొర వేతనాలతో రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేస్తున్న కార్మిక వర్గం ఇక నుంచి 13 గంటలు గనుక పని చేస్తే మానసిక ఒత్తిడికి లోనై తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఇదే అదునుగా యజమాన్యాలు కార్మికులతో గొడ్డు చాకిరీ చేయించే అవకాశం ఉంది. ఇప్పటికే 8 గంటల పని దినాలకు బదులుగా అనేక చోట్ల, పలు పారిశ్రామిక సంస్థల్లో 10 గంటలకు పైనే కార్మికులతో పనులు చేయించుకుంటున్న పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వమే పని గంటలను పెంచుతూ అధికారికంగా నిర్ణయం తీసుకోవడం వలన యాజమాన్యాలు కార్మికుల శ్రమను మరింతగా దోచుకునే అవకాశం ఉంది.

మోడీని ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్న చంద్రబాబుకి కార్మిక వర్గం నుంచి తిరుగుబాటు తప్పేలా కనిపించడం లేదు. పని గంటల పెంపు వలన అనేకమంది నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉంది. దీని ప్రభావం వలన ప్రతి ముగ్గురిలో ఒకరు ఉద్యోగం కోల్పోతారు. ఇప్పటికే నిరుద్యోగ సమస్య తీవ్ర స్థాయిలో ఉంది. ఉద్యోగ అవకాశాలు కల్పించక పోగా ప్రభుత్వం అనేక మందిని ఇటీవల కాలంలో తొలగించింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ సమస్య మరింత జఠిలమవుతుంది. ఆకలి మంటతో నిరుద్యోగ యువత ప్రభుత్వంపై జరగబడే అవకాశాలు ఉంటాయి. రాబోయే రోజుల్లో ఉపాధి అసాధ్యంగా మారుతుంది. ఆర్థిక, సామాజిక సంక్షోభానికి దారితీస్తుంది.

కార్మికుల ఆరోగ్యంపై ప్రభావం

అధిక పని గంటలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. అధిక సమయం పని చేయడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బర్న్ అవుట్, డిప్రెషన్, ఆందోళనకు కారణమవుతాయనే అభిప్రాయాలను మానసిక నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

పోరాటాలకు సిద్ధం

8 గంటల పని విధానం ఉన్నప్పుడే అనేక పరిశ్రమల్లో 12 గంటలు పని చేయించడం జరిగింది. అధికారికంగా 12 గంటలు చేస్తే కార్మికులతో యజ మాన్యాలు 14, 16 గంటలు పనిచేయించుకుని బానిసలుగా మారుస్తాయి. నిర్ణయాన్ని రద్దుచేయకపోతే పోరాటాలకు సిద్ధం

-జి.బేబీరాణి, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు

వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం

కూటమి ప్రభుత్వం పనిగంటల పెంచుతూ చేసిన తీర్మానాన్ని తక్షణం రద్దుచేయాలి. మహిళలతో రాత్రి వేళల్లో పనిచేయించడం మానుకోవాలి. ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. లేకపోతే కార్మిక వర్గం తిరగబడి ఈ ప్రభుత్వాన్నే రద్దు చేసే పరిస్థితి ఏర్పడుతుంది.

-దువ్వా శేషబాబ్జి, సిఐటియు జిల్లా అధ్యక్షులు

నిరుద్యోగం పెరుగుదల

పని గంటల పెంపు నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది. ప్రతి ముగ్గురిలో ఒకరి ఉద్యోగాన్ని పని గంటల పెంపు తొలగిస్తుంది. పగలే రక్షణ లేని మహిళలకు రాత్రి వేళల్లో పనులు చేయించడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధంగా ఉంది.

-చెక్కల రాజ్‌కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు

వైద్య విద్యలో పిపిపి విధానం వద్దు

ప్రజాశక్తి - కాకినాడ

వైద్య విద్యారంగంలో పిపిపి విధానం వద్దని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ఎపిఎన్‌జిఒ హోంలో రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం జిల్లా నాయకుడు ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ వామపక్ష, ప్రజా, దళిత, పౌర సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సిహెచ్.గోపినాథ్ మాట్లాడుతూ వైద్య విద్య కళాశాలలను పిపిపి విధానంలో నిర్వాహణ చేస్తామంటే వైద్య కళాశాలల నిర్వహణ బాధ్యత నుంచి ప్రభుత్వం పరోక్షంగా వదిలించుకుని, ప్రయివేటు వారికి వైద్య విద్యను అప్పగించడమేనని అన్నారు. పిపిపి మోడల్‌లో వైద్య విద్యార్థులు నుంచి సీట్ ఫీజు నిమిత్తం ఎంత వసూలు చేస్తారు? వైద్యం నిమిత్తం ప్రజల నుంచి ఏమైనా వసూలు చేస్తారా? అనేది తేటతెల్లం చేయాలని అన్నారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, లిబరేషన్ జిల్లా నాయకులు సిహెచ్.నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారి ఆర్థిక విధానం అవాలంబిస్తూ కార్పొరేట్ లకు వైద్య విద్య తాకట్టు పెట్టడానికి పిపిపి మోడల్ తీసుకొచ్చిందని అన్నారు. బిసి సంఘాల జాతీయ నాయకులు చోళ్లంగి వేణుగోపాల్, ఎస్‌సి, ఎస్‌టి ఫోరమ్ నాయకులు బయ్యా రాజేంద్రకుమార్, రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ వెనకబడిన సామాజిక వర్గాలకు చదువును దూరం చేసె కుట్రల్లో భాగమే పిపిపి విధానమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్‌రావు మాట్లాడుతూ రూ.3 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో రూ.8 వేలు కోట్ల ఖర్చు పెట్టి కాలేజీలు కట్టలేక పిపిపి పేరుతో ప్రయివేటకరణ చేస్తున్నారని అన్నారు. పౌర సంఘం నాయకులు డి.రమణరాజు మాట్లాడుతూ పిపిపి విధానం అమలు చేస్తే కూటమిలోని అన్ని పార్టీలు తగిన మూల్యం చెల్లించుకుంటాయని అన్నారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటికే ఇంటర్, నీట్ కోచింగ్‌కు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు ఖర్చు పెడుతున్నారని, పిపిపి విధానం వస్తే కోట్లు ఖర్చు చేయగల విద్యార్థులే వైద్య విద్య చదువుతారని, ఇది సమాజంలో సమాన అవకాశాలు దూరం చేయడమేనని అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వర్మ మాట్లాడుతూ పిపిపి విధానంలో జరుగుతున్న హైవే నిర్వహణలో ప్రజలను దోపిడీ చేస్తున్నట్లుగానే మెడికల్ కళాశాలల్లోనూ ఇదే విధానం కొనసాగే అవకాశం ఉందన్నారు. ఆర్‌టిఐ జెఎసి నాయకులు పప్పు దుర్గారమేష్, ఎంజెఎఫ్ నాయకులు హసన్ షరీఫ్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య చదువు చదవకుండా చేసె కుట్రలు కేంద్రం తీసుకు వస్తే ఆ కోవలోనే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. రాజశేఖర్ మాట్లాడుతూ గుజరాత్‌లో పిపిపి విధానం అమలవుతుందని, ఎ కేటగిరికి రూ.8 లక్షలు, బి కేటగిరికి రూ.16 లక్షలు, సి కేటగిరికి రూ.30 లక్షలు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇక్కడ కూడా అదే రకంగా చేసి 33 సంవత్సరాల తరువాత వెనక్కి తీసుంటే ప్రయివేట్ వారు ఒప్పుకుంటారా? అని ప్రశ్నించారు. దళిత ఉద్యమ నాయకులు అయితాబత్తుల రామేశ్వరావు మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచడానికి కార్యాచరణ చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎం.నరసింహం, గోపాలకృష్ణ, తదితరులు మాట్లాడారు. ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నడపాలని, పిపిపి విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు కరపత్రం ముద్రించి పంచాలని, సమావేశాలు, చర్చలు చేయాలని తీర్మానం చేసింది. వైద్య విద్య కోసం చదివే విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో సిపిఎం రూరల్ మండలం కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరావు, పలివెల వీరబాబు, జెవివి నాయకులు యు.సత్యనారాయణ, ఎస్‌ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, లోవరాజు, సాహిత్, వాసు తదితరులు పాల్గొన్నారు.

కొంగోడులో పొలంబడి

ప్రజాశక్తి - కరప, తాళ్లరేవు

కరప మండలం కొంగోడులో పోలంబడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య పాల్గొని మాట్లాడారు. పంటలలో సూటి ఎరువులు మరియు సూక్ష్మపోషకాలు సమయానికి సరైన మోతాదులో వాడటం ద్వారా దిగుబడి పెరిగి వ్యయం గణనీయంగా తగ్గుతుందని రైతులకు సూచించారు. మిశ్రమ ఎరువులను అధిక మోతాదులో వాడితే భూసారం దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎంవి.సతీష్, బండారు శ్రీరాములు, విఎఎలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు. తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో రైతు దడాల సత్తికొండ పొలం వద్ద పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రశాంతి పాల్గొని డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారి విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంపన రామకృష్ణ, రైతులు ధూళిపూడి వెంకటరమణ, విళ్ళ సత్యనారాయణ, వుంగరాల వెంకటేశ్వరరావు, బాబు, నాగరాజు, దడాల ప్రసాద్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సమస్యలపై న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బార్ అసోసియేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుదిమెళ్ళ భాస్కరాచార్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్‌గా నెలకు రూ.5000 ఇచ్చేవారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. పైగా ఆ పథకాన్ని నిలుపుదల చేయడం దుర్మార్గమని అన్నారు. న్యాయవాదులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐలు పెద్దాపురం యూనిట్ నాయకులు ఎస్‌కె.వల్లిబాబు, గణేష్, న్యాయవాదులు కె.వెంకటరాయుడు, పి.దొరబ్బాయి, డికె.జైన్, శ్రీనివాస్, ఎంకె.మొహిద్దిన్, నరసింహారావు, బొండు ప్రసాద్, నాయుడు, టి.నూకరాజు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం, గొల్లప్రోలు

సామర్లకోట, పెద్దాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో 'ఓన్ సోర్స్ రెవెన్యూ'పై శుక్ర, శనివారాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయా మండలాల ఎంపిడిఒలు కె.హిమమహేశ్వరి, కెవివి సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. కావున సకాలంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు ఆధార్‌తో అనుసంధానం ఉన్న ఫోన్ నంబర్లతో హాజరు కావాలని వారు సూచించారు. అలాగే గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు ఓన్ సోర్స్ రెవెన్యూ పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభం అవుతుందని ఎంపిడిఒ నీతిపూడి సాలెట్ రాజు ఒక ప్రకటనలో తలెఇపారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఇన్‌ఛార్జ్ ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 57 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యులకు పంపించినట్లు చెప్పారు. సమావేశానికి వార్డు మెంబర్లు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఆధార్ ఛార్జీల పెంపు తగదు

ప్రజాశక్తి - కాకినాడ

అక్టోబర్ నుంచి ఆధార్ సర్వీస్ ఛార్జీలు పెంపు చేయడం తగదని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. జిఎస్‌టి పన్నులు తగ్గించామని చెప్పే ప్రభుత్వం ఆధార్ ఛార్జీలు పెంచడం సహేతుకం కాదన్నారు. ఆధార్ తప్పుల సవరణకు, వివరాల నవీకరణకు ప్రస్తుత ధర రూ.50ను రూ.75కు, బయోమెట్రిక్ అప్డేట్ ధర రూ. 100 ఉండగా రూ.125కు పోర్టల్ ద్వారా నేరుగా పొందే సేవలను రూ.50 నుంచి రూ.75కు పెంచడం దారుణమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు మహిళా సమైక్య కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం పి.విజయలక్ష్మి, ఐపిఒ సందీప్, ఎటిఎ సన్యాసిరావు వివిధ ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలు సత్య, బాల, సిసిలు రాజకుమారి, నాయుడు, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ్‌లో సాంకేతిక విద్యా ఉత్సవాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో 3 రోజుల పాటు జరిగే సాంకేతిక విద్యా ఉత్సవాలను గురువారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ, డైరెక్టర్ బుర్రా అఖిలేష్ ప్రారంభించారు. విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో అనే అంశాలపై పోటీలు నిర్వహిస్తామని స్మార్ట్ బ్రిడ్జ ప్రతినిధి అక్షయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి 24 గంటల హ్యాక్ థాన్ నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆధునిక టెక్నాలజీ రంగంలో ఎఐతో అద్భుతాలు సృష్టించేందుకు కావలసిన కోడింగ్ విధానాన్ని విద్యార్థులకు వినూత్న రీతిలో నేర్పించేందుకే సాధన 2క25 ఏర్పాటు చేయడం జరిగిందని కళాశాల ఛైర్మన్ బుర్రా అనుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకల్లో యాజమాన్య ప్రతినిధులు

ఆదిత్యలో ఘనంగా ఫార్మసిస్ట్ డే

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసి కళాశాలల్లో వరల్డ్ ఫార్మసిస్ట్ డే వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానా పాల్గొని మాట్లాడారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి? ప్రభుత్వ రంగంలో లభించే వివిధ ఉద్యోగ అవకాశాలపై ఆమె వివరించారు. వివిధ సెమిస్టర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పథకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. డీన్, స్కూల్ ఆఫ్ ఫార్మసీ డాక్టర్ డి.సతీష్‌కుమార్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానాను సత్కరించారు. సైబర్ సెక్యూరిటీ ఛాలెంజెస్ ట్రెండ్స్ అండ్ ఫ్యూచర్ డైరెక్షన్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ అడ్వకేట్ రాయవరపు ప్రదీప్ పాల్గొని హాకింగ్, సైబర్ క్రైం జరిగిన ఉదంతంపై ఎలా స్పందించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ కో - ఆర్డినేటర్ శ్వేత, డాక్టర్ మాధవిలత, డాక్టర్ వైదేహి, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లతో విద్యార్థులు, అధ్యాపకులు

కార్టూ'నిజం'

'స్వచ్ఛత వైపు అడుగులు వేయాలి'

జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛతాహీ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొని పరిసరాలను పరివుభ్రం చేశారు. అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ ప్రజలందరూ స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో స్వచ్ఛతాహీ సేవ స్ఫూర్తితో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణను శుభ్రం చేశారు. చెత్తను తొలగించి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా స్ఫూర్తితో కనీసం రోజుకో గంటపాటైనా పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. మన ఇంటితోపాటు పని చేసే కార్యాలయాల పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. మన పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు మానసిక ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెసి రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మానీషా, డిఆర్ఒ వెంకటరావు డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులా నాయక్, సిపిఒ పి.త్రినాథ్, కలెక్టరేట్ ఎఒ ఎస్.రామ్మోహన్‌రావు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా కోరంగి పంచాయతీ సీతారామపురంలో గురువారం సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన పారిశుధ్య కార్మికులను సత్కరించారు. తొలుత గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మణరావు, ఎఒ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి బిజెవి.రమణ, ఉప సర్పంచ్ కామాడి భైరవమూర్తి, ఎంపిటిసి సభ్యులు పోతుల రత్నకుమారి, టిడిపి నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, అత్తిలి బాబూరావు, వాడ్రేవు వీరబాబు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక పంచాయితీ కార్యదర్శి జి.శివ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సచివాలయం వద్ద, సంతమార్కెట్లోని పరిసరాలను పరిశుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి సత్యనారాయణమూర్తి, సిడిపిఒ ఎం.పూర్ణిమ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, హరిగోపాల్, దేవరపల్లి మూర్తి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **కరప** కరపలో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ సలాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజలు శ్రమదానం నిర్వహించారు. ప్లాస్టిక్ చెత్త, ఘన వ్యర్థాలను తొలగిస్తూ స్వచ్ఛతపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ముద్రగడ రమేష్, నాయకులు భోగిరెడ్డి కొండబాబు, బండారు మురళీ, భోగిరెడ్డి గంగాధర్, సొసైటీ ఛైర్మన్ సైనవరపు భవానిశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వర్ధన్, ఎపిఒ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** రమణయపేట పంచాయతీ పరిధి ఎస్ఆర్ఎంటి గెస్ట్ హౌస్ నుంచి సర్పవరం జంక్షన్ వరకు స్వచ్ఛతాహీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, ఎంపిడిఒ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక సీతారామ కాలనీలోని మున్సిపల్ పార్క్‌లో శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ ఇన్‌ఛార్జ్ ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రదేవి, కమిషనర్ శ్రీవిద్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పాలిక కుసుమ, హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, టిడిపి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట రైల్వే స్టేషన్‌లో రైల్వే ఉద్యోగులు, కార్మికులు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శ్రమదానం చేశారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. **ఏలేశ్వరం** మండలంలోని ఎర్రవరం గ్రామంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఎంపిడిఒ సిహెచ్.రవికుమార్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, కూటమి నాయకులు బస ప్రసాద్, మైరాల కనకారావు, మండల ఉద్యానవన శాఖ అధికారి కె.దివ్యశ్రీ, కార్యదర్శి రామరాజువర్మ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. **రౌతులపూడి** రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారి ఉమామహేశ్వర్‌రెడ్డి, వైద్యులు స్వాగత్, ఆరోగ్య మిత్ర శ్రీనివాస్ శ్రమదానం చేశారు. **గండేపల్లి** స్థానిక పిహెచ్‌సి వద్ద శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.హరికృష్ణసత్యరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ ఐఎన్.శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్షుడు కూతురు మోహన్‌రావు, నాయకులు బొల్లంరెడ్డి రామకృష్ణ రెడ్డి, పరిపాలన అధికారి చంద్రరావు, సెక్రెటరీ విఆర్.ఫణీంద్రకుమార్, ఎపిఎం సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికుడు వెంకన్నను సత్కరించారు.

అవగాహన ర్యాలీలో కలెక్టర్, జెసి, ఇతర అధికారులు

నేరాలు ఘోరాలు

మహిళపై దాడి చేసి బంగారం చోరీ

ప్రజాశక్తి-నల్లజర్ల

బాధిత మహిళ సుభద్ర

మహిళపై రాత్రితో దాడి చేసి 15 కాసుల బంగారాన్ని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన నల్లజర్లలో గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నల్లజర్ల కోడలి సమీపంలో పాకలపాటి సుభద్ర ఒంటరిగా నివసిస్తున్నారు. పగలంతా ఆమె కుమారుడు వెంకటరమేష్ తల్లి వద్దే ఉంటున్నాడు. రాత్రి సమయంలో అదే గ్రామంలో తన అత్తమామల ఇంటి వద్ద నిద్రిస్తున్నాడు. ఇదిలా ఉండగా గురువారం తెల్లవారు జామున మాస్కులు ధరించిన నలుగురు సుభద్ర ఇంట్లోకి చొరబడ్డారు. గాఢ నిద్రలో ఉన్న సుభద్రపై రాత్రితో దాడి చేసి బెదిరించారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను లాక్కున్నారు. అనంతరం గదిలో ఉన్న బీరువాను పగలగొట్టి వెతికారు. ఆమె చేతిలో ఉన్న మొబైల్‌ను లాక్కొని వెనుక వైపు నుంచి పారిపోయారు. ఇవన్నీ అక్కడ ఉన్న సిసి కెమెరాలో నమోదయ్యాయి. సుభద్ర ఇంటి పక్కన ఉంటున్న రెండు బైకులను సైతం వారు తీసుకెళ్లిపోయారు. విషయాన్ని తన కుమారుడు వెంకట రమేష్‌కు తెలిపింది. అక్కడికి వచ్చిన రమేష్ నల్లజర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం కొవ్వూరు డిఎస్‌పి దేవకుమార్, దేవరపల్లి సిఐ నాయక్, నల్లజర్ల ఎస్ఐ దుర్గాప్రసాద్ చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన మహిళ మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

భవనంపై ఆరేసిన దుస్తులు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురైన మహిళ చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన కొమ్మిరి స్వర్ణకుమారి (45) ఈనెల 18న డాబాపై ఆరేసిన బట్టలు తీస్తుండగా డాబాకు ఆనుకుని ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లపై ఒక్కసారిగా ఒకవైపు ఎగిరాయి. దీంతో విద్యుత్ వైర్లు కుమారికి తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. తీవ్రంగా గాయపడిన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గురువారం చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని ఎర్రవరం గ్రామంలో గురువారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు వేమగిరి చిన్నయ్య తెలిపిన వివరాలు ప్రకారం..గురువారం తెల్లవారు జామున సంభవించిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ఒకేసారి మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైందని ఆవేదన వ్యక్తం చేశాడు. నిద్రలో ఉన్న తనతోపాటు, తన భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ప్రాణాలతో బయటపడ్డామని తెలిపారు. ఇంటిలోని అన్ని వస్తువులతోపాటు, నగదు పూర్తిగా దగ్ధమైందని కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

కల్తీ ఆయిల్ తయారీ కేంద్రంపై దాడి

ప్రజాశక్తి - తుని

పట్టణంలోని రామకృష్ణ కాలనీ శివారులో పశువుల కళేబరాలతో కల్తీ ఆయిల్‌ను తయారు చేస్తున్న కేంద్రంపై సిఐ ఎం.గీతారామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 8 టన్నుల కల్తీ ఆయిల్, 40 పశువుల చర్మాలు, పశు మాంసం, మూడు ఆవులను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ వర్క్ లెవల్-4 ప్రకారం అకౌంట్స్ అసిస్టెంట్ అసెస్‌మెంట్‌లో విజయవంతంగా ఉత్తీర్ణులైన 56 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను గురువారం అందించారు. ముఖ్యఅతిథిగా కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఒడి డాక్టర్ రామచంద్ర, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ పివివి.సత్యనారాయణ, బిఎఫ్ఎస్ఐ కో-ఆర్డినేటర్ రమేష్‌కృష్ణ విప్పర్తి, కె.సునీత, టి.శిరీష, ఇతర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సర్టిఫికెట్లను బిఎఫ్ఎస్ఐ ఎస్ఎస్‌సి, ఎన్ఎస్‌డిసి జారీ చేశాయి.

సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని మోర్త సచివాలయంలో గురువారం పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. సర్పంచ్ చిటికెన సుజని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్భిణులకు నూతన వస్త్రాలు, గాజులు, పండ్లు, మిఠాయిలు, పోషకాహారం, ఆకుకూరలు పంపిణీ చేశారు. సిడిపిఒ ఆశా రోహిణి, సెక్టార్ సూపర్‌వైజర్లు బాలసరస్వతి పంచాయతీ కార్యదర్శి టి.బాలత్రిపుర సుందరి, సంధ్యారాణి, గ్రామ పెద్దలు, సచివాలయం, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. వేలివెన్ను పిహెచ్‌సి పరిధిలోని సత్యవాడలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం వైద్యాధికారి వై.సృజన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఇసుకపల్లి ప్రభావతి, కూటమి నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

భోజనాలు అందిస్తున్న మంగతాయారు

స్థానిక లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పిడిజి మాటూరి మంగతాయారు అన్నారు. అభాగ్యులకు భోజన క్యారేజీలు అందించే కొప్పిశెట్టి లక్ష్మయ్య చేపట్టిన 1000వ రోజుయైన గురువారం ఆమె భోజన క్యారేజీలు అందించారు. తాళ్లరేవు పంచాయతీ జెల్లావారిపేటలో నేరేడుమిల్లి ఏడుకొండలుకు లయన్స్ క్లబ్ సహకారంతో సొంతగృహం నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్లు, ఒకరికి గ్రైండర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌సిఎంఎస్ఆర్‌వి.సత్యనారాయణ, లైన్స్ క్లబ్ ప్రతినిధులు పొన్నాడ పేరయ్యరాజు, నడింపల్లి వినోద్, బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, చోడే శ్రీనివాస్, నున్న దత్తు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వరస చోరీలు

-బెంబేలెత్తిపోతున్న ప్రజలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో పలు పంచాయతీల పరిధిలో ఉన్న ఆలయాల్లో వరుస చోరీలు జరిగాయి. బుధవారం అర్ధరాత్రి సమయంలో కుతుకుడిమిల్లి నిదానం దొడ్డిలో ఉన్న దుర్గమ్మ ఆలయంలో, కొత్తపల్లి ముత్యాలమ్మ గుడి సమీపంలో ఉన్న వినాయకుడి గుడిలో హుండీల్లో నగదును దొంగలు చోరీలకు పాల్పడ్డారు. రాత్రి సమయంలో పోలీసులు గస్తీ లేకపోవడం వల్లే వరుస చోరీలు జరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. రాత్రి సమయాలలో పోలీసులు గస్తీని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూసెన్స్‌కు కారణమైన వారిపై చర్యలు

ప్రజాశక్తి - రావులపాలెం

ఒజి సినిమా ప్రీ రిలీజ్ సందర్భంగా ఫ్యాన్స్ ముసుగులో కొంతమంది ఆకతాయిల న్యూసెన్స్ చేయడంతో వారిని వీడియో ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటామని టౌన్ సిఐ శేఖర్‌బాబు తెలిపారు. పోలీసులు వివరాలు ప్రకారం ఓజీ సినిమా ప్రీ రిలీజ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలకు పాల్పడవద్దని ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ స్థానిక అక్షర, పద్మశ్రీ థియేటర్ల వద్ద ఆకతాయి యువకులు మోటార్ సైకిల్ విప్పి ధ్వని కాలుష్యం చేస్తూ పబ్లిక్ న్యూసెన్సు, పాల్పడ్డారు. న్యూసెన్స్ చేసిన ఆకతాయిలను, రెండు మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. న్యూసెన్స్ కు కారణమైన వారిని వీడియోల ద్వారా గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అసెంబ్లీలో ఛాంబర్ కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

శాసనసభలో ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజుకి అసెంబ్లీలో ఛాంబర్‌ను గురువారం కేటాయించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం చేశాయి. సుబ్బరాజుకు ప్రస్తుత వర్షాకాల శాసనసభ సమావేశాల్లో భాగంగా నూతన ఛాంబర్ ను కేటాయించగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు ముఖ్య అతిథిగా హాజరై ఛాంబర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తన ఛాంబర్‌లోని బాధ్యతలు చేపట్టిన సుబ్బరాజును చీఫ్ విప్ జిఇ.ఆంజనేయులు, సహచర విప్ తో పాటు పర్సనల్ సెక్రటరీ సుబ్బరాజు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - అంబాజీపేట

రాష్ట్రస్థాయి బాల్ బ్యాట్మింటన్ కోకో అథ్లెటిక్ పోటీలకు పుల్లేటికుర్రు హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఎ. వెంకట్రావు తెలిపారు. ఈనెల 22, 24 తేదీలలో జిల్లాస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ లలో బ్యాడ్మింటన్‌లో సిహెచ్.జ్యోతి సాయి పల్లవి, ఎ.రశ్మిత, వాలీబాల్ లో జి.రమా అక్షిత లు ఎంపికయ్యారన్నారు. విజేతలైన క్రీడాకారులను, పిఇటి అందె సూర్యనారాయణ, డి.ఉదయ్‌లను సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపిటిసి హైస్కూల్ చైర్మన్ ఎస్.రత్నమాల, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓట్ల దొంగ మోడీ గద్దె దిగాలంటూ ర్యాలీ

ప్రజాశక్తి - నిడదవోలు

'ఓట్ల దొగ మోడీ గద్దె దిగాలి' అంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గణేష్ చౌక్ నుంచి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎలక్షన్ కమిషన్, బిజెపి దిష్టి బొమ్మలను శవయాత్రగా ఊరేగిస్తూ నిరసన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. బిజెపి అప్రజాస్వామికంగా గద్దెనెక్కిందన్నారు. భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కై పాలన సాగిస్తుందన్నారు. దేశ ప్రధానే దేశాన్ని, ప్రజల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ టికె.విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, నిడదవోలు నియోజకవర్గం కో-ఆర్డినేటర్ మేడవరపు భద్రందొర, రాష్ట్ర కిసాన్ విభాగం ఉపాధ్యక్షులు కాకర్ల శ్రీహరిబాబు, ఎఐసిసి సభ్యులు మహ్మద్ అమర్జహబేగం, ఎస్‌సి విభాగం జిల్లా అధ్యక్షులు శాఖ పుల్లారావు, మోత శారద, బిల్డర్ బాబీ, డాక్టర్ వడయార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకె విసి ప్రసాద్ నుంచి అవార్డు అందుకుంటున్న వైద్యులు బెన్నబాబు

ఆర్ఎంపి వైద్యునికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరంలో ఆర్ఎంపి వైద్యునిగా సేవలు అందిస్తున్న పదిలం బెన్నబాబుకు జాతీయ స్థాయిలో పీస్ ఐకాన్ అవార్డు లభించింది. వైద్యుడు బెన్నబాబు 1993లో కలకత్తాలో మదర్ థెరిస్సా ఆశ్రమంలో ఆమెతో కలిసి కుష్టు వ్యాధిగ్రస్తులకు సేవలు అందించారు. గత కొన్ని దశాబ్దాలుగా వైద్యరంగంలో సేవలు అందిస్తూ బేసిక్ మెడికల్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా, రాష్ట్ర అనుభవ వైద్య సంఘాల సమాఖ్య రాష్ట్ర పొలిట్ బ్యూరోగా, రాష్ట్ర సమాచార ప్రచార శాఖ కార్యదర్శిగా, రెడ్ క్రాస్ లైఫ్ సభ్యునిగా, సెయింట్ జోన్ అంబులెన్స్ లైఫ్ సభ్యునిగా అంతర్జాతీయ మానవ హక్కుల క్రైమ్ కంట్రోల్ లైఫ్ సభ్యునిగా సేవలందించారు. ఈ నేపథ్యంలో గ్లోబల్ పీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకులు డాక్టర్ రాజా యోనా ఆధ్వర్యంలో జెఎన్‌టియుకె విసి సిఎస్ఆర్‌కె.ప్రసాద్ చేతుల మీదుగా ఆయన పీస్ ఐకాన్ అవార్డు అందజేశారు.

ధర్నా చేస్తున్న టిడిపి శ్రేణులు

టిటిడిలో అక్రమాలను నిరసిస్తూ టిడిపి ఆందోళన

ప్రజాశక్తి - సామర్లకోట

వైసిపి పాలనా కాలంలో టిటిడిలో జరిగిన అవినీతి, అక్రమాలు, అరాచకాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. గురువారం స్థానిక మఠం సెంటర్లో టిడిపి శ్రేణులు ప్లకార్డులను ప్రదర్శిస్తూ దేవుని సొమ్ము పాపం పాపం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బడుగు శ్రీకాంత్, అడపాల కుమారస్వామి, బలుసు వాసు, కంటే జగదీష్ మోహన్, అందుగుల జార్జి చక్రవర్తి, వల్లూరు దొరబాబు, గొల్తి సత్యనారాయణ, మెండు సత్రయ్య, ఎండి సైపుల్ల, ఎండి అబీబుల్లా పాల్గొన్నారు.

అంకంరెడ్డి కుటుంబానికి పర్వత పరామర్శ

ప్రజాశక్తి - రౌతులపూడి

ములగపూడి మాజీ సర్పంచ్ అంకంరెడ్డి సూర్యనారాయణ కుటుంబాన్ని ఎంపిపి పర్వత రాజబాబు పరామర్శంచారు. సూర్యనారాయణ కుమారుడు రామకృష్ణ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన కుటుంబాన్ని ఎంపిపి పరామర్శించారు. తొలుత మృతుడు రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పర్వత వివేక్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల గుర్తింపుపై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే కార్యక్రమాల్లో భాగంగా మార్గదర్శకాలను మండల టిఓటిలకు శిక్షణా కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగింది. బంగారు కుటుంబాల నమోదు, ఇతర విషయాలు యాప్‌లో పొందుపరచిన విధంగా చేయాలని శిక్షణ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఎఒ సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమములో పలు పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలించిన ఏరువాక శాస్త్రవేత్త

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పత్తి పంటపై టుబాకో స్ట్రేక్ వైరస్ సోకుతుందని ఏరువాక శాస్త్రవేత్త ఎస్‌విఎన్.శర్మ అన్నారు. గురువారం మండలంలోని చేబ్రోలు దుర్గాడ గ్రామాలలో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటపై ఆశించిన టుబాకో స్ట్రీక్ వైరస్ మిగిలిన మొక్కలకు ఆశించకుండా నివారించేందుకు విప్రోని 400 ఎంఎల్ లేదా ఫ్లోనీ కామిడ్ 60 గ్రాములు లేదా ఎసి పెట్ 300 గ్రాములు, లేదా దాయోమిథిక్షం 40 గ్రాములు, 200 లీటర్లు మందు ద్రావణం చేను అంతా తడిసేటట్లు పిచకారి చేయాలని అన్నారు. గట్లపై కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం వ్యవసాయ శాఖ ఎడి పి.స్వాతి, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా తాటిపాక మధు ఎన్నిక

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా తాటిపాక మధు ఎన్నికయ్యారు. ఈ నెల 21 నుంచి 25 వరకు చండీఘర్‌లో జరిగిన సిపిఐ 25 వ జాతీయ మహాసభ సందర్భంగా గురువారం జాతీయ సమితిని ఎన్నుకున్నారు. ఇందులో ఆంధ్ర ప్రదేశ్ నుంచి మధుకు స్థానం కల్పించారు. ప్రస్తుతం ఆయన జిల్లా కార్యదర్శిగా ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగం అప్రమతతంగా ఉండాలని కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున క్షేత్ర స్థాయి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలన్నారు. తుపాను నేపథ్యంలో కలెక్టరేట్‌లో 9493206371, 9908454580, టోల్ ఫ్రీ నెంబర్: 1800-425-8585తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఇది 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ నెంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

ఉత్సాహంగా స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరంలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లరాజానగరంలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌ల స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపు గురువారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా విఐసిసి కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్ఎం.అగర్వాల్ మాట్లాడారు. జాతీయ సమైక్యతను ప్రోత్సహించి, సాంస్కృతిక అవగాహన పెంపొందించి భారతదేశ వారసత్వం, సంప్రదాయాల గౌరవభావం పెంచడమే ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దేశంలోని 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాల 17 ఎన్‌సిసి డైరెక్టరేట్లకు చెందిన 300 మంది సీనియర్ క్యాడెట్లు ఈ క్యాంపులో పాల్గొంటున్నారని తెలిపారు. అక్టోబర్ 5వ తేదీ వరకు క్యాంపు కొనసాగుతుందన్నారు. భాగస్వామ్య అనుభవాలు, సమాజ జీవనం ద్వారా క్యాడెట్లలో ఏకత్వం, నాయకత్వం, క్రమశిక్షణ, దేశభక్తి విలువలను బోపేతం చేయడం జరుగుతుందన్నారు. ఇవన్నీ క్యాడెట్లలో నాయకత్వ నైపుణ్యాలు, స్నేహబంధం, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తాయన్నారు. దీనిలో కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్ ఎస్ మానిక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షునిగా ప్రతాప్

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం యర్నగూడెం శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షునిగా బొడ్డు ప్రతాప్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు యర్నగూడెం శాఖా గ్రంథాలయంలో ఎంఇఒ శ్రీనివాసరావు సమక్షంలో సమావేశం నిర్వహించారు, ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయం ఆధునిక దేవాలయం అన్నారు. గ్రంథాలయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 11 మంది సభ్యులతో అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బొడ్డు ప్రతాప్‌కుమార్, ఉపాధ్యక్షునిగా ఎలిగంటి వెంకటస్వామి, కార్యదర్శిగా చింతా సాయిచైతన్య, సహాయ కార్యదర్శిగా జగతి పరమేశ్వరరావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంతా భరత్‌బాబు, ఎంపిటిసి సభ్యులు బొంతా చినబాబు, టిడిపి నాయకులు బొల్లిన విజయభాస్కర్, జనసేన నాయకులు వర్ధినీడి నరేంద్ర, గద్దె శ్రీనివాస్, విఆర్ఓ చాంద్ భాషా, గ్రంథాలయ అధికారి జి.అనిత తదితరులు పాల్గొన్నారు

ఆదర్శలో అంతర్జాతీయ ఫార్మసిస్ట్ డే

ప్రజాశక్తి-గోకవరం

విజేతలకు బహుమతులు అందిస్తున్న శ్రీనివాసరావు

అంతర్జాతీయ ఫార్మసిస్ట్ డేను ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆడిటోరియంలో ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథ్‌రావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెఎన్‌టియుకె ప్రొఫెసర్ డాక్టర్ సమయమంతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి మారుమూల ప్రాంతంలో అద్భుతమైన వసతులు కలిగిన కళాశాలను నిర్వహించడం విద్యార్థుల అదృష్టమన్నారు. పుట్టిన ఊరికి ఒక గుర్తింపు రావాలని ఇక్కడ కళాశాలను ప్రారంభించిన యాజమాన్యం అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా రావడం హర్షణీయమన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి మొట్టమొదటి ప్రైవేటు ఫార్మసీ కాలేజ్ ఆదర్శ కాలేజ్ అనిత ఎలిఆపరు. మెదటి ఏడాదే నాలుగు విభాగాల్లో ఆదర్శ విద్యార్థులు మొదటి పది ర్యాంకుల్లో ఉండడం గర్వకారణమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ నాగమణి, ప్రిన్సిపల్ త్రినాథ్‌లు, కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుందూరులో పొలంబడి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలం కుందూరు గ్రామంలో గురువారం పొలంబడిని మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏరువాక కో-ఆర్డినేటర్ ఎమ్.నందకిషోర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో అధిక తేమ మరియు అధిక ఉష్ణోగ్రత, అధిక నత్రజని వాడిన నేపథ్యంలో వరి పైరులో పొడ తెగులు లేదా మాగుడు ఆశిస్తుందన్నారు. ఈ ఆశించిన వరికాండం మొదల్లో భూమి నుండి వ్యాప్తి చెందే శిలీంధ్రాలు వల్ల బూడిద రంగు మచ్చలు నీటికి దగ్గరగా ఉన్న కాండంపై బూడిద రంగు మచ్చలు ఏర్పడ తాయన్నారు. ఈ తెగులు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మచ్చలు పెద్దవిగా అయ్యి ఆకులు మరియు కాండం ఎండిపోతాయన్నారు. పొలంగట్లపై కలుపు లేకుండా చూసుకొని నత్రజని వాడకాన్ని తగ్గించి పొటాష్ ఎరువు వేయాలన్నారు. దీని నివారణకుగాను హెక్సాకొనాజోల్ 2 మిల్లీ లేదా వాలి డామైసిన్ 2 మిల్లిలీటర్, ప్రొపికొనజోల్ 1 మిల్లీలీటర్, అజోక్సీస్ట్రోబిన్ 23 శాతం ఎస్‌సి 1 మిల్లీలీటర్, లేదా అజోక్సీస్ట్రోబిన్‌ంటెబుకొనజోల్ 1.5 మిల్లీలీటర్ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసు కోవాలన్నారు. అలాగే ఇదే వాతావరణంలో సుడిదోమ కూడా ఆరంభ దశలో ఉందని ఈ ఆశించిన దుబ్బులు నుంచి రసం పీల్చడం వల్ల ఆకులు పసుపు రంగుకు మారి క్రమేపి ఎండిపోతాయన్నారు. తీవ్రత ఎక్కువగా ఉంటే పైరు సుడులు-సుడులుగా ఎండిపోతుందన్నారు. అలాగే దుబ్బుకు 10 నుంచి 15 పురుగులు అలాగే ఈనిక దశలో 20 నుంచి 25 పురుగులు ఉన్నట్లయితే పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. దీని నివారణకు ట్రైఫ్లూమిజోఫైరిం 0.48 మిల్లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎప్పుడూ రెండు లేదా మూడు మందులు కలిపి పిచికారీ చేయరాదన్నారు. రెండోసారి పిచికారీ అవసరమైతే మొదటి మందు కాకుండా రెండో ముందు మార్చి వాడాలి. అలాగే సింథటిక్ పైరిత్రాయడ్ పురుగు మందులు వాడరాదని, వరిలో పర్యావరణ విశ్లేషణ ద్వారా పైరు ఆరోగ్యం, వాతావరణ పరిస్థితి పై అవగాహన ద్వారా తెగుళ్ల పురుగులపై యాజమాన్యం కొరకు నిర్ణయం తీసుకుని తద్వారా పెట్టుబడిని తగ్గించి ఆరోగ్యకరమైన లాభసాటి వ్యవసాయాన్ని చేయాలని రైతులను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నాయుడు, మేడిశెట్టి బాబి, ప్రక్రృతి వ్యవసాయ సిబ్బంది విఎఎలు కృష్ణతేజ, రేవతి, రైతులు పాల్గొన్నారు.

ఎంపి వైదిలింగంతో యానాం కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎంపిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి కాంగ్రెస్ ఎంపి వి.వైదిలింగంను స్థానిక కాంగ్రెస్ నాయకులు అర్దాని దినేష్, కాటంశెట్టి రామూర్తి బృందం గురువారం మర్యాదపూర్వకంగా పుదుచ్చేరిలో కలిశారు. ఈ మేరకు వారు స్థానిక మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. యానాంలో సమస్యలను ఎంపి దృష్టికి తీసుకెళ్లామని, ఒఎన్‌జిసి గ్యాస్ లేకేజ్‌పై ఆ సంస్థ అధికారులతో మాట్లాడినట్లు ఎంపి చెప్పారని తెలిపారు. యానాం ప్రజలకు భద్రత కల్పించాలని కోరినట్లు ఎలిపారు. డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, క్లీనింగ్ ఉండటం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కెవిఎస్‌జిజి హైస్కూల్ శిధిలావస్థలో ఉన్నందున ఎంపి నిధులను కేటాయించేందుకు అంగీకరించినట్లు చెప్పారు. పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వల్లే యానానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ఆ ఇద్దరి నుంచి యానాన్ని రక్షించాలని కోరినట్లు తెలిపారు.

ఘనంగా పండిట్ దీన్ దయాల్ జయంతి

ప్రజాశక్తి - యానాం

పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని గురువారం స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మాట్లాడుతూ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జీవిత చరిత్ర, ఆయన దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు గుర్తు చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.రత్నప్రభ, ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ సిహెచ్.కృష్ణసుధాకర్, లీలాకుమారి, ప్రసన్నకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్‌వి.కృష్ణంరాజు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నడుపల్లిలో మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని కానూరు పిహెచ్‌సి వైద్యులు కె.హేమరాజు, పి.తేజశ్రీ ఆధ్వర్యంలో 'స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా నడుపల్లిలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూరుగుపల్లి శ్రీరాములు, చిట్టూరి వెంకటనారాయణ, సిహెచ్ఒ కె.జయమణి, ఎంపిహెచ్ఇఒ ఎం.రాజామోహన్, కెవి.నాగేశ్వర రావు, ఎఎన్ఎం ఎన్.జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పి సిహెచ్.అంజు, హెల్త్ అసిస్టెంట్ ఎ.ప్రేమ్‌కుమార్, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

కొవ్వూరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభించామని ప్రిన్సిపల్ జె.సునీత తెలిపారు. ఈనెల 26 నుంచి 29 వరకూ పేర్లను ు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె సూచించారు. 27 నుంచి 29 సర్టిఫికెట్ల పరిశీలన, 29 నుంచి అక్టోబరు 1 వరకు వెబ్ ఆప్షన్ల పరిశీలన చేస్తామన్నారు. 3న వెబ్ ఆప్షన్లు మార్పుకు అవకాశం ఉందన్నారు. 6న సీట్ల కేటాయింపు, 7న విద్యార్థులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. బిఎ హిస్టరీ, బికాం కంప్యూటర్స్, బికాం జనరల్, బిఎస్‌సి కంప్యూటర్స్, బిఎస్‌సి మ్యాథమెటిక్స్, బిఎస్‌సి కెమిస్ట్రీ, బిఎస్‌సి బోటనీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

నగర అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా నగరపాలక సంస్థ 2026-27 వార్షిక బడ్జెట్‌ను సిద్ధం చేయాలని అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్ లో ప్రతిపాదిత బడ్జెట్ రూపకల్పనపై శాఖాధిపతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా అన్ని విభాగాల అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రజా శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా వార్షిక బడ్జెట్ అంచనాలు ఉండాలని సూచించారు. నగరంలో ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా పార్కుల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు అధిక కేటాయింపులు ఉండాలన్నారు. అక్టోబర్ 8 నాటికి నివేదికను అందించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, అన్ని విభాగాల హెచ్ఒడిలు పాల్గొన్నారు

CHANGE OF NAME

I, MOHAMMAD KAREEMULLAH, S/o. Mohammad Mohibullah, D.No. 15-4-18/305, Vignesh Towers, Girls High School Street, Kovvur, E.G.Distrct, A.P., PIN: 534350. I have changed my name from **MOHAMMAD KARIMULLAH** (Old Name) to **MOHAMMAD KAREEMULLAH** (New Name). Hence forth Iam being called **MOHAMMAD KAREEMULLAH**, S/o. Mohammad Mohibullah, for all purpose.

ప్రకటన

నా క్లయింటు అయిన కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి గ్రామం ముస్లింవీధి డోర్.నెం.1-208రు కాపురస్తులు **షేక్ వల్లీ గారి కుమారుడు షేక్ బషీర్ జానీ** నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియచేయునది ఏమనగా.

నా క్లయింటు తాలూకు యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఆస్తికి లింకు **డాక్యూమెంట్సు నెం.3552/2018** తుని సబురిజిస్టార్లు ఆఫీసు మరియు **దస్తావేజు నెం.8255/2020** తుని సబురిజిస్టార్లు ఆఫీసు నందు రిజిష్టర్ కాబడిన రెండు లింకు డాక్యూమెంట్సు బెండపూడి నుండి తొండంగి వచ్చుచుండగా పడిపోయినవి. ఎంత వెతికినను అట్టివి లభ్యము కాలేదు, గనుక యిందుమూలముగా తెలియచేయునది ఏమనగా సదరు రెండు లింకు డాక్యూమెంట్సు ఎవ్వరికి అయిన దొరికినయెడల నాకు తెలియచేయవలెను.

యింకనూ సదరు రెండు దస్తావేజులను పురస్కరించుకుని ఎవ్వరైనా ఎట్టి అన్యాక్రాంతములు చేసిననూ అట్టివి నా క్లయింటును ఎంతమాత్రం బైండు చేయజాలవు.

ఆస్థి వివరం: కాకినాడ జిల్లా తొండంగి మండలం తుని సబుడి బెండపూడి గ్రామం తాలూకు డోరు.నెం.1-154రు సమీపమున స.నెం.273/1రు దాఖలా చ॥గ 121 లు ఖాళీ నివేశన స్థలంకు హద్దులు: **తూర్పు:** అ 33.00 ఆవురుసాటి శ్రీను గారి ఆస్తి. **దక్షిణం:** అ 33.00 నంబారు సత్తిబాబు గారి ఆస్తి. **పడమర:** అ 33.00 నమ్మి సోమరాజు గారి ఆస్తి. **ఉత్తరం:** అ 33.00 రోడ్డు. సదరు హద్దుల మధ్యస్థమయిన చ॥గ 121లు స్థలం అందుల సర్వం సహా..

Siddanthapu Thirumala Rao, B.A.B.L.
Advocate, #5-81, Valluru/Vunduru, Samalkot Mandal,
Kakinada dist, Cell: 8897431181

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.A. No. 352/2022
I.A. No. 353/2022 in
O.S. No. 406/2017

Between:
Sri Sape John Paul Raju, S/o. Daniel, Christian, age 50 yrs, C/o. Matta Gandhi, Opposite Out Gate, Rly Station, Vasundhara Lodge, Rajamahendravaram, RJY CJCJ.
...Petitioner/ Defendant
AND
Sri Konku Subba Rao, S/o. Mala Kondayya, Hindu, age 45 yrs, D.No. 80-16-27/3, Srinivasa Nagar, Rajamahendravarm, RJY CJCJ.
...Respondent/ Plaintiff

పై నెంబరు గ్రంథంలో రెస్పాండెంటు/ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 23-10-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై గ్రంథంలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు గ్రంథంను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.భరణికుమార్
రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
25-9-2025 సెల్:9848315163